క్లుప్తంగా

కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పీలేరు : గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆపరేటర్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. నారాయణదాస్ కోరారు. ఈమేరకు విజయవాడలో డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడును కలసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ, ఆనంద్, అహ్మద్, లావణ్య, రామాంజనేయులు, కిరణ్‌కుమార్, వెంకటరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

వైభవంగా గుంటి గంగమ్మ జాతర



గుంటి గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి బాహుదానది ఒడ్డున వెలసిన గుంటి గంగమ్మ జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారు జామున అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిపారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి భక్తులు దీలు, బోనాలు సమర్పించారు. రాత్రి చాందినీబండ్లు ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 20న వేలంపాట

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామ పంచాయతీలో వారపు సంతకు సంబంధించి ఈనెల 20న వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ వెంకట్రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి కల్యాణి తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20న ఉదయం 11 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో 2023–24 ఏడాదికి వారం సంత వేలంపాటలు నిర్వహిస్తామన్నారు. వేలం పాటల్లో పాల్గొనే వారు ముందుగా రూ.30వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 9మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో కళాశాల యాజమాన్యం

పీలేరు : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 9 మంది అభ్యర్థులు ఎంపికై నట్లు కళాశాల చైర్మన్ ఎంపీ అవినాష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఏపీటీ ఆన్‌లైన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 104 మంది రాత పరీక్షకు హాజరు కాగా 18 మంది టెక్నికల్ రౌండ్‌కు ఎంపికయ్యారు. వీరిలో 9మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌లు సత్య, రవి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు సంత వేలం పాట

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలో నిర్వహించే వారపు, రోజు వారి సంత వేలం పాటలను శనివారం సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రహమత్ బీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు డిపాజిట్ చెల్లించి సంత వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

నేడు రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రం సచివాలయం -2 లో శుక్రవారం ఉదయం 11 గంటలకు వారపుసంత , దినసరిమార్కెట్, బస్టాండ్ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ చలపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు వారపుసంత, దినసరి మార్కెట్ రూ.2లక్షలు, బస్టాండ్ రూ.75 వేలు, మొదట డిపాజిట్ చేయాలన్నారు. వేలంపాటలో దక్కించుకున్న పాటదారులు సాయంత్రం 5 గంటల లోపు మొత్తం నగదును చెల్లించాలని సూచించారు. అలాగే చెంబకూరులో గురువారం నిర్వహించాల్సిన వేలంపాటదారులు ఎవరు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వేలం పాటను త్వరలోనే నిర్ణయిస్తామన్నారు.

రాఘవరెడ్డి సేవలు ప్రశంసనీయం



డీఈఓ రాఘవరెడ్డిని సన్మానిస్తున్న డీవైఈఓ, ఎంఈఓ తదితరులు

మదనపల్లె సిటీ : జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి సేవలు ప్రశంసనీయమని మదనపల్లె డీవైఈఓ క్రిష్ణప్ప అన్నారు. గురువారం డీవైఈఓ కార్యాలయంలో బదిలీపై కడప డీఈఓగా వెళుతుండటంతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, పలువురు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగు.. లాభాలు బాగు

- ఒక ఎకరాలో 80 రకాల పండ్లతోటలు
- సేంద్రియ పద్ధతిలో సాగు
- స్థిరమైన ఆదాయం ఆర్జిస్తున్న రైతు



చంద్రశేఖర్ సాగు చేసిన మిశ్రమ పండ్లతోట

పీలేరు : వినూత్న పద్ధతిలో ఒక ఎకరాలో వివిధ రకాల పండ్ల తోటలు సాగు చేసిన ఓ రైతు నూతన ఒరవడికి నాంది పలికాడు. ఒక ఎకరాలో 80 రకాల పండ్ల మొక్కలు సాగు చేసి విజయం సాధించాడు. వివరాలిలా.. మండలంలోని మొరవవడ్డిపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్ మారుతున్న కాలానికి అనుగుణంగా కొంచెం భిన్నంగా ఆలోచించాడు. తనకున్న ఒక ఎకరా పొలంలో 80 రకాల పండ్ల మొక్కలు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేశాడు. ఐదారు సంవత్సరాలు వయస్సు గల మొక్కలు ప్రస్తుతం దిగుబడినిస్తున్నాయి. సేంద్రియ పద్ధతిలో సాగు చేయడంలో మొక్కలు ఆరోగ్యంగా ఉండడంతోపాటు మంచి దిగుబడినిస్తుండడంతో ఈ పండ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. పీలేరు పరిసర ప్రాంత వ్యాపారులు, ప్రజలు తోట వద్దకే వెళ్లి నాణ్యమైన పండ్ల కోసం ఎగబడుతున్నారు. తక్కువ పెట్టుబడితో సాగు చేసిన మిశ్రమ పండ్ల తోటలతో స్థిరమైన ఆదాయం వస్తోందని రైతు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు. ఆదాయంతోపాటు తన కుటుంబానికి అవసరమైన నాణ్యమైన పండ్లు కూడా లభిస్తున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. చంద్రశేఖర్‌ను ఇతర రైతులు ఆదర్శంగా తీసుకుని మిశ్రమ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ఎన్నో కొత్త రకం పండ్ల మొక్కలు..

చంద్రశేఖర్ సాగు చేసిన మిశ్రమ పండ్ల తోటలో ఎన్నో కొత్త రకం పండ్ల మొక్కలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా సిమ్లా యాపిల్, లిచ్చి, కర్జూరం, వాటర్ యాపిల్, శివనాగ, రామసీతాఫలం, అంజురా, సుగంధ ద్రవ్యాల మొక్కలు, కొత్త రకం మామిడి, అల్లనేరేడు, సపోటా, జామ, దానిమ్మ తదితర మొక్కలు ఉన్నాయి.

మొత్తం సేంద్రియ పద్ధతిలోనే



ఒకే రకం పంటలు సాగు చేయడం వల్ల చీడపీడలు ఆశించడం, దిగుబడి కూడా తక్కువ వచ్చేది. మిశ్రమ పంటలతో చీడపీడల బెడద ఉండదు. మరోవైపు మొత్తం సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తుండడంతో నాణ్యమైన పండ్లతో మంచి ఆరోగ్యం లభిస్తుంది. మా వద్ద లభిస్తున్న రక రకాల పండ్ల కోసం వ్యాపారులు తోట వద్దకే వస్తున్నారు.

– చంద్రశేఖర్, రైతు, మొరవవడ్డిపల్లె

మిశ్రమ పంటలతో సత్ఫలితాలు



ఒక పొలంలో మిశ్రమ పంటలు సాగు చేయడం మంచి పద్ధతి. అది కూడా సేంద్రియ ఎరువులు ఉపయోగించి పండ్ల తోటలు సాగు చేస్తే ప్రయోజనం ఉంటుంది. అన్ని సీజన్లలో రక రకాల పంటలు దిగుబడి రావడంతో ఏడాదంతా రైతుకు ఆదాయం కన్పిస్తుంది. మిశ్రమ పంటలు సాగుచేస్తే మేము సూచనలు, సలహాలు ఇస్తాం.

– సుకుమార్‌రెడ్డి, ఉద్యానశాఖఅధికారి, పీలేరు

ఆలయ పునర్నిర్మాణానికి రూ.51వేలు విరాళం



రూ.51వేలును విరాళంగా అందిస్తున్న దాతలు

నిమ్మనపల్లె : తవళం గ్రామంలోని శ్రీ యోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణానికి నిమ్మనపల్లె పంచాయతీ పెద్దమాదిగపల్లెకు చెందిన కె.లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో కలిసి రూ.51,116లను విరాళంగా అందజేశారు. గురువారం ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, దర్శనానంతరం ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ అర్చకులు శంకరశాస్త్రిలకు విరాళ నిధులను అందించారు. ఆలయ కమిటీ సభ్యుడు గోపాలకృష్ణ, దాతలైన ఓ.లక్ష్మీదేవి, కె.మోహన్‌లను సత్కరించారు.

రేపు ప్రత్యేక లోక్‌అదాలత్

తంబళ్లపల్లె : స్థానిక కోర్టులో శనివారం ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఉమర్‌ఫరూఖ్ తెలిపారు. కక్షిదారులు రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని కోరారు. ఫ్యామిలి పరమైన కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్షా మసీదు ప్రహరీకి రూ. 12 లక్షలు మంజూరు



పంచాయతీ తీర్మానం మసీదు పెద్దలకు అందిస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : పీలేరు పట్టణంలోని అక్షా మసీదు ప్రహరీ నిర్మాణానికి రూ. 12 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పంచాయతీ తీర్మానాన్ని మసీదు పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో గ్రామ పంచాయతీ నిధులు రూ. 12 లక్షలు ప్రహరీ నిర్మాణానికి వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రటరీ గడీబాషా, అతికాషఫీ, కాలేషా, జిలానీ, సైపుల్లా, రియాజ్, మహబూబ్‌బాషా, అబీద్, రియాజ్, బాషా, అంజాద్, పీఆర్ ఏఈ తేజేశ్వర్, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పక్కన బీసీ సంక్షేమాధికారి సందప్ప

నిమ్మనపల్లె : విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి బి.సందప్ప అన్నారు. గురువారం నిమ్మనపల్లెలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. నిమ్మనపల్లె వైద్యాధికారి డాక్టర్ భానునాయక్, సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మునివెంకటమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే మైనారిటీల సంక్షేమం



మైనారిటీల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం : బి.కొత్తకోటలో నారా లోకేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను స్థానిక ఎంపీపీ మహమూద్, కోఆప్షన్ ఖాదర్‌వలి, సర్పంచ్ రహ్మతుల్లా, ఎంపీటీసీ చంద్రశేఖర్ తదితరులు ఖండించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలోని సంక్షేమ పథకాల వల్ల మైనారిటీలు సుభిక్షంగా ఉన్నారన్నారు. ముస్లిం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడంలో జగన్ విఫలమయ్యారని లోకేష్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు రిజర్వేషన్ల సాధన కోసం పోరాడితే చంద్రబాబు కోర్టుకెళ్లి రిజర్వేషన్ శాతాన్ని తగ్గించిన విషయాన్ని లోకేష్ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఇకనైనా ఆరోపణలు చేసే ముందు ఆలోచించి మాట్లాడాలని లోకేష్‌కు హితబోధ చేశారు.

నాలుగు రోజులకోసారి తాగునీరు అందించాలి

పీలేరురూరల్ : పీలేరు పట్టణంలో నాలుగు రోజుల కోసారి తాగునీరు అందించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్‌మెన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 150 స్కీం బోర్లు ఉన్నాయని, ఇందులో 60 బోర్లు వాడకంలో ఉన్నాయని తెలిపారు. అవసరమైతే మిగిలిన బోర్లు వాడకంలోకి తీసుకొస్తామన్నారు. అలాగే 60 చేతి బోర్లు ఉన్నాయని తెలిపారు. పైపులైన్లు, గేటువాల్వ్‌లు మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రెడ్డిప్రసాద్ రెడ్డి, శానిటరీఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

సంపూర్ణ మిశ్రమ దాణాతో పాల దిగుబడి



టీఎమ్ఆర్ దాణాను పంపిణీ చేస్తున్న పంజం సుకుమార్‌రెడ్డి, పశువైద్యాధికారులు

రైల్వేకోడూరు : సంపూర్ణ మిశ్రమ దాణా వినియోగం వల్ల పాల దిగుబడులు పెరుగుతాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం అనంతరాజుపేట పంచాయతీలోని తంబిళ్ళవారిపల్లెలో రైతులకు మొదటివిడతగా 5 టన్నుల మిశ్రమదాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంజం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంపూర్ణ మిశ్రమ దాణాను రైతులకు అందిస్తోందన్నారు. వేసవికాలంలో పచ్చిమేత తక్కువగా ఉండటంతో పశువులు, గేదెలలో సమతుల్యతను కాపాడేందుకు, పాలదిగుబడి తగ్గకుండా ఉండేందుకు ఈ సంపూర్ణ మిశ్రమదాణాను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ రోజు 5 రైతు భరోసా కేంద్రాలలో 5 టన్నుల టీఎమ్ఆర్‌ను పంపిణీ చేశామన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఈ దాణాను తీసుకోవడం జరిగిందన్నారు. టిఎమ్ఆర్ దాణా కొరకు రైతుభరోసా కేంద్రాలలో సంప్రదించి ఆన్‌లైన్‌లో కేజీ 6.5 రుపాయల కొనుగోలు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో జెట్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ పెంచలమ్మ, ఎంపీటీసీలు బండారు మల్లి, జనార్దన్‌రాజులు, సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌రాజు, పశువైద్యాదికారులు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ నాగశిరీష, ఎహెచ్ఎ హరిచరణ్, బ్రహ్మణి, రైతులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

లక్కిరెడ్డిపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని 1998 డీఎస్సీ అభ్యర్థులు తెలిపారు. గురువారం లక్కిరెడిపల్లిలో 1998 డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీఎస్సీ ఎంప్లాయ్ యూనియన్ అసోసియేషన్ సభ్యుడు చంద్రమౌళి మాట్లాడుతూ 23 సంవత్సరాల కిందట మూలనపడ్డ జీఓను వెలికితీసి మాకు ఉద్యోగ భిక్షపెట్టిన జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం మా కుటుంబాలు రుణపడి ఉంటాయని, 19 డీఎస్సీ ఎంప్లాయ్ యూనియన్ అసోసియేషన్ సభ్యుడు చంద్రమౌళి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తమ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 98 డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు పాల్గొన్నారు

ఘనంగా బ్రహ్మణపల్లి గంగమ్మ జాతర

రాజంపేట రూరల్ : గంగమ్మ జాతరను మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వైభవంగా గురువారం నిర్వహించారు. జాతరకు వేలాది మంది తరలిరావడంతో బ్రాహ్మణపల్లిలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. గంగమ్మను పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు, గాజులు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి రాజంపేట మండలంతోపాటు సమీప మండలాల నుంచి ప్రజలు వచ్చారు. మహిళలు పొంగళ్లు పొంగించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆకేపాటి ప్రత్యేక పూజలు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి జాతరలో పాల్గొని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆకేపాటిని గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవతలను పూజించడం వలన వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూలనపడ్డ సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు



వెలుగు కార్యాలయంలో మూలన ఉన్న ఒంటి మడక యంత్రాలు ,తేనె తయారీ యంత్రాలు

గుర్రంకొండ : గుర్రంకొండలోని వెలుగు కార్యాలయంలో సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు మూలనపడ్డాయి. గిరిజనులు తేనె తయారీ కోసం వినియోగించే యంత్రాలు కార్యాలయంలో తుప్పు పడుతున్నాయి. రైతులకు 50శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు వ్యవసాయ యంత్రాలు నాలుగేళ్ల క్రితం స్థానిక వెలుగు కార్యాలయానికి వచ్చాయి. మొత్తం 13 ట్రాక్టర్లతో దున్నే ఒంటిమడకలు మంజూరయ్యాయి. ఒక్కో మడక విలువ రూ.14,666 కాగా అందులో 50 శాతం సబ్సిడీ ఉంటుంది. నిబంధనల మేరకు సబ్సిడీ పోను ఒక్కో రైతు రూ. 8330 చెల్లించాలి. వెలుగు గ్రామ సమాఖ్యల ద్వారా వీటిని అవసరమైన రైతులకు పంపిణీ చేసేందుకు అధికారులకు అప్పట్లో ఆదేశాలు వచ్చాయి. అయితే కిందిస్థాయి సిబ్బంది వీటిని రైతులకు విక్రయించడంలో శ్రద్ధ చూపించడం లేదనే విమర్శలున్నాయి. దీంతో ఇవి వెలుగు కార్యాలయంలో ఓ మూలన పడి ఉన్నాయి. వీటితో పాటు గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు తేనె తయారు చేసే యంత్రాలు అప్పట్లో మంజురయ్యాయి. 75 శాతం సబ్సిడీతో వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నా అధికారులు వీటి గురించి పట్టించుకోవడం లేదు. వీటిని ఇలాగే వదిలేస్తే తుప్పు పట్టే అవకాశముంది. ఆధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్

కురబలకోట : ఓటరు కార్డుకు ప్రతి ఒక్కరూ ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వరరావు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించి సోమవారం లోగా ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో 32,813 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మహిళలు 16,571, పురుష ఓటర్లు 16,242 మంది ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 26,992 ఓటరు కార్డులకు ఆధార్ అనుసంధానం జరిగిందన్నారు. 82.26 శాతం పూర్తయిందన్నారు. ఓటర్లు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెంటనే తమ ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ

వాల్మీకిపురం : ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి సాధ్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. గురువారం మండలంలోని టి.సాకిరేవుపల్లిలో రైతు చంటి రెండు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన టమాటా, బీన్స్, పెసర, మిరప, వంగ, అరటి, ఉల్లి, కొబ్బరి, ఆముదం, బంతి, వరి పంటలను పరిశీలించారు. అలాగే ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వరి పంటకు ఉపయోగించే ద్రవ జీవామృతాన్ని పరిశీలించారు. దీంతోపాటు అయ్యవారిపల్లిలో మహిళా రైతు ఉషా, బూడిదవేడులో మహిళా రైతు లలిత వారి పంట పొలాల్లో వేసిన ప్రకృతి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసులు, రెడ్డిబాషా, సావిత్రి, పెద్ద రెడ్డెయ్య, స్వాతి, వినోద్, భాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



మదనపల్లె కాలేజీ వద్ద పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని అడుగుతున్న విద్యార్థి తండ్రి

తంబళ్లపల్లె : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 118 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 115 మంది హాజరయ్యారు. చీఫ్ ఎగ్జామినర్ రామాంజనేయప్రసాద్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ శ్రీనివాసులు పరీక్షను పర్యవేక్షించారు.

మదనపల్లెలో..

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలో 10 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. హర్షిత అనే విద్యార్థికి క్రిష్ణారెడ్డి సిద్దార్థ కాలేజీ సెంటర్ కేటాయించారు. అయితే సిద్దార్థ కాలేజీ అనుకుని అక్కడికి వెళ్లి తిరిగి క్రిష్ణారెడ్డి కాలేజీ వద్దకు ఆలస్యంగా రావడంతో పరీక్షా అధికారులు పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. విద్యార్థిని తల్లిదండ్రులు హెల్ప్‌లైన్‌కు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యార్థి తల్లిదండ్రులు వాపోయారు.

గ్యారంపల్లె విద్యార్థికి రాష్ట్రస్థాయి బహుమతి



బహుమతి స్వీకరిస్తున్న ఎ. జీవన్‌కుమార్

కేవీపల్లె : ఇటీవల గుంటూరులో జరిగిన 49వ మ్యాథమేటికల్ ఒలంపియాడ్‌లో గ్యారంపల్లె ఏపీఆర్ఎస్ విద్యార్థికి రాష్ట్ర స్థాయి బహుమతి లభించిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె. సురేష్ తెలిపారు. తమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఎ. జీవన్‌కుమార్ రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించాడన్నారు. గుంటూరు ఏపీ ఏఎంటీ సమావేశంలో విద్యార్థి బహుమతి అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థి ప్రగతికి కృషి చేసిన గణిత ఉపాధ్యాయులు గురునాథ, విష్ణువర్ధన్, శారదలకు అభినందనలు తెలిపారు. అలాగే పీలేరుకు చెందిన బండి సృజనశ్రీ ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించి బహుమతి సొంతం చేసుకుంది. సృజనశ్రీ కమ్మనపల్లె ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



మదనపల్లె సిటీ:పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వాసవీ క్లబ్ సభ్యుల నివాళి



పీలేరు రూరల్:పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యుల నివాళి



వాల్మీకిపురం:పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు



బి.కొత్తకోట: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, ఉద్యోగులు

మదనపల్లె సిటీ : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు మదనపల్లెలో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమ్మచెరువుమిట్టలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు డైపర్స్, పండ్లు పంపిణీతో పాటు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సీనియర్ వైస్ ప్రెసిండెంట్ చంద్రశేఖర్‌గుప్తా, క్రిష్ణమూర్తి, జిల్లా గవర్నర్ వెంకటేష్, అధ్యక్షుడు నరేంద్రకుమార్, కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారి లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : స్థానిక వారపుసంత వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూనా సత్యనారాయణ, నాయకులు మల్లికార్జునశెట్టి, వేణుగోపాల్, అరవింద్‌బాబు, వంశీకృష్ణ, బాలాజి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..,

వాల్మీకిపురం : తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగాన్ని ఎన్నటికీ మరువలేమని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్ అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పొట్టి శ్రీరాములు 122వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మెహరున్నీసాబీబి, ఉపాధ్యాయలు రామలక్ష్మమ్మ, కల్పన, రేఖ, దీపిక, గౌతమి, శ్రావణి, వినయ, లావణ్య, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను గురువారం వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శంకరయ్య, ఏఈ దినేష్, ఏపీఓ మంజుల, ఏఓ థామస్, ఉద్యోగులు, సిబ్బంది శ్రీరాములు చిత్రపటానికి పుష్పాలతో నివాళి అర్పించారు. భాషాప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడు శ్రీరాములు అని కొనియాడారు. భవిత కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీరాములు చిత్రపటానికి ఎంఈఓ రెడ్డిశేఖర్ పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులకు బిస్కట్లు పంచారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు మహేష్, బాస్ నాయకులు సచిన్, నరసింహులు, ఉబేదుల్లా, సప్పి రమేష్‌బాబు, సంకు సబ్జి, సురేష్ పాల్గొన్నారు.